# మోడల్ వర్సిటీలుగా
# జేఎన్‌టీయూహెచ్, ఓయూ!

- అన్ని విశ్వవిద్యాలయాల చుట్టూ ప్రహరీ ఉండాలి..
- ప్రతి హాస్టల్‌లో వెల్‌నెస్ సెంటర్ తప్పనిసరి
- 'తెలంగాణ విద్యా విధానం'పై సిఫార్సు చేయనున్న మౌలిక వసతుల కోర్ గ్రూప్



ఈనాడు, హైదరాబాద్: 'రాష్ట్రంలో తొలి విడతగా జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియాలను మోడల్ వర్సిటీలుగా తీర్చిదిద్దాలి.. మౌలిక వసతుల కోసం మూడేళ్లలో ఈ రెండు వర్సిటీలకు ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించాలి' అని విద్యాసంస్థల్లో మౌలిక వసతులపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన కోర్ గ్రూప్ సిఫార్సు చేయనుంది. జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణకూ ప్రత్యేకంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఛైర్మన్‌గా కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. నివేదికల రూపకల్పనకు 11 కోర్ గ్రూప్‌లను సర్కారు నియమించింది. మౌలిక వసతులు, డిజిటల్ టెక్నాలజీ, పరిశోధన, సిలబస్ తదితర అంశాలపై పలుమార్లు సమావేశమైన కోర్ గ్రూప్‌లు ఈ వారంలో నివేదికలను కమిటీ ఛైర్మన్‌కు అందజేయనున్నాయి. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలోని మౌలిక వసతుల గ్రూప్ పలు ఆసక్తికర సిఫార్సులను చేయనున్నట్లు తెలిసింది. అవి..

- విద్య, మౌలిక వసతులు, పరిశోధన, నవకల్పన అంశాల్లో ఎక్సలెన్స్ సాధించేందుకు.. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను చేరుకునేందుకు ఎంపిక చేసిన వాటిని మోడల్ వర్సిటీలుగా అభివృద్ధి చేయాలి.
- మొదటి విడతలో జేఎన్‌టీయూహెచ్, ఓయూలను ప్రాధాన్యంగా తీసుకోవాలి. మూడేళ్లలో ఒక్కో వర్సిటీకి విశ్వవిద్యాలయ మౌలిక వసతుల ఆధునికీకరణ నిధి కింద రూ.200 కోట్ల చొప్పున ఇవ్వాలి. కేంబ్రిడ్జి, స్టాన్‌ఫర్డ్ వర్సిటీల తరహాలో అంతర్జాతీయ స్థాయిలో ఆ రెండు ప్రాంగణాలను రీడిజైన్ చేయాలి.
- మోడల్ వర్సిటీల్లో విదేశీ విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాలతోపాటు కౌన్సెలింగ్ విభాగాలను నెలకొల్పాలి.
- అంతర్జాతీయ నిపుణులతో సమన్వయం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ఉన్నతస్థాయి సలహా కమిటీని నియమించాలి. ఆ కమిటీ.. యూకే, సింగపూర్, థాయ్‌లాండ్‌లలో విభిన్నమైన డిజైన్లు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు తెలుసుకొని అమలు చేసేందుకు ఆయా దేశాల్లో పర్యటించాలి.
- కేంద్రీయ వర్సిటీల మాదిరిగా అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ప్రతి వర్సిటీలో ఉపకులపతి ఛైర్మన్‌గా మౌలిక వసతుల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి పెద్ద విద్యా సంస్థలో ఉద్యోగుల పిల్లల కోసం ఛైల్డ్ కేర్ సెంటర్ నెలకొల్పాలి.
- అన్నింటినీ హరిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దాలి.
- విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు ప్రతి హాస్టల్‌లో వెల్‌నెస్ రూమ్ తప్పనిసరి చేయాలి. బాస్కెట్‌బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ లాంటివి ఆడుకునేందుకు అవకాశం కల్పించాలి.
- యూజీ, పీజీ కళాశాలలు పట్టణ ప్రాంతాల్లో 3 ఎకరాలు, గ్రామీణ ప్రాంతాల్లో 5 ఎకరాల విస్తీర్ణంలో ఉండాలి.
- పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలకు ప్రతి 1,500 మంది విద్యార్థులకు 3-4 ఎకరాలు, గ్రామీణ ప్రాంతాల్లో 4-5 ఎకరాల స్థలం ఉండాలి. ప్రతి పాఠశాలలో కంప్యూటర్, ఏఐ, నైపుణ్య, టింకరింగ్, ప్రాక్టికల్ ల్యాబ్‌లు ఉండాలి. డిజిటల్ గ్రంథాలయాలు తప్పనిసరి.